క్లుప్తంగా

విద్యార్థులకు బ్యాగుల అందజేత



విద్యార్థులకు బ్యాగులు, షూస్, అందిస్తున్న దాత రెడ్డిశెట్టి కుటుంబసభ్యులు

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, పాఠశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని హెచ్‌ఎం సంగీత అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్ద ప్రాథమికోన్నత పాఠశాలలో అదే వార్డుకు చెందిన రెడ్డిశెట్టి కుటుంబ సభ్యులు ముందుకొచ్చి గురువారం మొదటి అంతస్తులోని వరండాలో గ్రిల్స్ ఏర్పాటు, విద్యార్థులకు బ్యాగులు, షూస్, స్నాక్స్, టై, బెల్టులు, బ్యాడ్జీలను అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు దాతలను అభినందించారు. కార్యక్రమంలో రెడ్డిశెట్టి కుటుంబ సభ్యులు వీరయ్య, నర్సింలు, ప్రకాశం, ప్రభు, సాయి సచిన్, సత్యసాయి సేవా సమితి ఇన్‌చార్జి గోపాలచారి, చేగూరి మాణిక్యరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఉన్నారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఎంపీడీఓ వెంకయ్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: మండలంలో నిర్వహించే వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ వెంకయ్య సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొద్ది రోజుల్లో వన మహోత్సవ కార్యక్రమం ప్రారంభమవుతుందని, దానికి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. మొక్కలు నాటె స్థలాలను గుర్తించాలని, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని, లబ్ధిదారులు గోడలు నిర్మించడం ప్రారంభిస్తే వాటి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ గిరిరాజు, ఏపీఓ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో మరమ్మతులు ప్రారంభం



మరమ్మతులను పరిశీలిస్తున్న నాయకులు

షాద్‌నగర్: పట్టణంలోని 15వ వార్డు కోర్టు పక్కన గల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పలు మరమ్మతులు ప్రారంభించారు. ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిన్నారులు, బాలింతలు, గర్భిణులు కూర్చునేందుకు కూడా వీలులేని విషయం ఉండటాన్ని గుర్తించారు. వెంటనే ఎమ్మెల్యే తన సొంత ఖర్చులతో అంగన్‌వాడీలో బండలు వేయించడంతో పాటు మరమ్మతులు చేపట్టారు. ఈ పనులను పార్టీ నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు విశ్వం, తిరుపతిరెడ్డి, చెన్నయ్య, బస్వం, రఘుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పతంజలి యోగా సమితి వ్యవస్థాపకుడు శశిధర్



శశిధర్‌ను సన్మానిస్తున్న యోగా గురువులు

షాద్‌నగర్‌రూరల్: ప్రతి నిత్యం క్రమం తప్పకుండా యోగ సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పతంజలి యోగా సమితి వ్యవస్థాపకుడు పానుగంటి శశిధర్ అన్నారు. గురువారం గురుపౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో యజ్ఞ సహిత యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగ గురువులు మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యజ్ఞ సహిత యోగ ద్వారా పర్యావరణం శుద్ధ అవుతుందన్నారు. రాందేవ్ బాబా చెప్పినట్లుగా ఘర్ ఘర్ యోగ.. హర్ ఘర్ యోగ నినాదంతో యోగాను వ్యాప్తి చేసేందుకు అందరి సహకారంతో ముందుకు సాగుతున్నామన్నారు. అనంతరం 20 సంవత్సరాలుగా పట్టణంలో యోగ శిక్షణ నిర్వహిస్తున్న యోగ గురువు పానుగంటి శశిధర్‌ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యోగ గురువులు కుమారస్వామి, లింగమయ్య, రామయ్య, వరలక్ష్మి, కల్యాణి, హరిత, వనజ, జ్యోత్స్న పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

- అసంపూర్తిగా ఆస్పల్లిగూడ–చర్లగూడ బ్రిడ్జి నిర్మాణం
- అధికారుల నిర్లక్ష్యంతో నిలిచిన పనులు
- ఆయా గ్రామాల ప్రజలకు తప్పని తిప్పలు



చర్లగూడ వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెన పనులు

షాబాద్: మండల కేంద్రంలోని ఆస్పల్లిగూడ–చర్లగూడ గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణ పనులను మూడేళ్ల క్రితం ప్రారంభించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ఇప్పటికీ పనులు పూర్తి కాకపోవడంతో వాహనదారులు, ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణాన్ని తర్వగా పూర్తిచేయాలని ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో వాహనదారులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో..

మండల పరిధిలోని ఆస్పల్లిగూడ–చర్లగూడ గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి 2022లో ప్రభుత్వం రూ.7.70కోట్లతో పనులు ప్రారంభించి శిలాఫలకం వేశారు. బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1 కోటి 30లక్షలు మంజూరు చేసింది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగలేదు. దీంతో మూడేళ్లుగా ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. అధికారులు స్పందించి త్వరగా బ్రిడ్జి పనులను, బీటీరోడ్డు పనులను పూర్తిచేసి తమ ఇబ్బందులు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.7.70 కోట్లు మంజూరు..

మండల పరిధిలోని చర్లగూడ గ్రామ ప్రజలకు మెరుగైన రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఆస్పల్లిగూడ–చర్లగూడ గ్రామాల సమీపంలో బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు రూ.7.70కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. మూడేళ్లు గడిచినా నిర్మాణ పనులు పూర్తి చేయలేదు. బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1కోటి 30లక్షలు మంజూరు చేసినా బ్రిడ్జి సమీపంలో తాత్కాలికంగా వేసిన మట్టిరోడ్డు వర్షాలకు బురదమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రూ.1.70లక్షల పనులు కాంట్రాక్టర్ పూర్తి చేసినా ఎంబీ రికార్డు చేసిన అధికారులు నేటికీ ఒక్క పైసా కూడా చెల్లించకపోవడంతో పనులను వదిలేసి కాంట్రాక్టర్ వెళ్లిపోయాడు.

వర్షాకాలంలో ఇబ్బందులు..

సమీప గ్రామాల ప్రజలతో పాటు పలువురు రైతులు తాత్కాలికంగా వేసిన రోడ్డు పాడవడంతో ఇబ్బందులకు గురి కావడమే కాకుండా ప్రమాదాల బారిన పడే పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. కొంతవరకు నిర్మించిన బ్రిడ్జి కూడా శిథిలావస్థకు చేరుతోందని పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు బ్రిడ్జి నిర్మాణం, బీటీ రోడ్డు పనులు పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



వంతెన పనులకు వేసిన శిలాఫలకాలు

ప్రమాదాలు జరుగుతున్నాయి



తాత్కాలిక రోడ్డుపై రాత్రి సమయంలో ప్రయాణించాలంటే భయపడాల్సి వస్తోంది. చర్లగూడ, ఆస్పల్లిగూడ గ్రామాల రైతులు పనుల నిమిత్తం వెళ్తూ ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. బ్రిడ్జి నిర్మాణంతో పాటు బీటీ రోడ్డు నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి.

– రాజేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు, చర్లగూడ

పనులు త్వరగా పూర్తిచేయాలి



బ్రిడ్జి, బీటీ రోడ్డు నిర్మాణాలకు ప్రత్యేక నిధులు కేటాయించి పనులను వెంటనే పూర్తి చేయాలి. వర్షాలు ఎక్కువ కురిస్తే ఈ వాగుపై నుంచి నీరు పొలాల్లోకి చేరి పంటలు దెబ్బతింటాయి. అదేవిధంగా ప్రజలు, రైతులకు రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది. అధికారులు స్పందించి పనులు పూర్తిచేయాలి.

– ఆంజనేయులు, మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

ఉన్నతాధికారులకు వివరించాం



ఆస్పల్లిగూడ–చర్లగూడ గ్రామాల మధ్యలో ఉన్న వంతెన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్‌కు పనులు నిలిపివేశాడు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించాం. నిధులు విడుదల కాగానే పనులను ప్రారంభిస్తాం.

–విజయ్‌కుమార్, డీఈఈ, పంచాయతీరాజ్

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



కేశంపేట: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు

కొందుర్గు: ఇతర గ్రామాల్లో చదువుకునే విద్యార్థులకు పాఠశాలకు వెళ్లి రావడానికి బస్సు సౌకర్యం కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం కొందుర్గు డిప్యూటీ తహసీల్దార్ రాకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకుడు రవీందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 26 వేలకుపైన ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో 22 లక్షల మంది విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నారని, ఇందులో 60 శాతం విద్యార్థులు ఇతర గ్రామాలకు వెళ్లి చదువుకుంటున్నారన్నారు. వారి సౌకర్యార్థం 30 మంది విద్యార్థులకు ఓ బస్సును ఏర్పాటు చేసి, విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, రాములు, సంజీవ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఏర్పాటు చేయాలి

కేశంపేట: సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత బస్సులను ఏర్పాటు చేయాలని కోరుతూ మండల కేంద్రంలో తహసీల్దార్ అజాంఅలీకి బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు వినతిపత్రం అందించారు. 20 నుంచి 30 మంది విద్యార్థులకు ఒక్క ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు రమేశ్‌గౌడ్, పాండు ముదిరాజ్, ధర్మసమాజ్ పార్టీ నాయకులు రమేశ్, మహిపాల్, రవి, మల్లేశ్, అంజి, కృష్ణ, విష్ణు, పురుషోత్తం, నరేశ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి



రైతలకు యూరియా బస్తాలను అందిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: మండలంలోని రైతులకు ప్రాథమిక సహకార సంఘంలో యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని, అవసరం ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన యూరియా కొనుగుళ్ల ప్రారంభించి, రైతులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బస్తా 267 రూపాయలకు అందిస్తున్నట్లు తెలిపారు. అవసరం ఉన్న రైతులు, కౌలు రైతులు తమ ఆధార్‌కార్డు చూపించి యూరియా కొనుగోలు చేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సొసైటీ ద్వారా యూరియా అందిస్తున్నామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి వెంకటయ్య, చేవెళ్ల మాజీ ఉప సర్పంచ్ టేకుపల్లి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జనార్దన్, మాజీ వార్డు సభ్యులు మల్లేశ్, సొసైటీ పరిధిలోని రైతులు తదితరులు ఉన్నారు.

షాబాద్ ప్రత్యేకాధికారిగా మధుసూదన్



అధికారి మధుసూదన్‌ను సన్మానిస్తున్న ఎంపీడీఓ అపర్ణ, తదితరులు

షాబాద్: షాబాద్ మండల ప్రత్యేకాధికారిగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్‌ను ప్రభుత్వం నియమించింది. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అపర్ణ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ.. మండలంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తనకు సహకరం అందించాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ మల్లేశ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

గురుపౌర్ణమి సందర్భంగా గురువారం చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లోని సాయిబాబా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు తరలిరావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో మహిళలు, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.



షాద్‌నగర్: పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు



షాద్‌నగర్: దేవాలయంలో చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



మొయినాబాద్ రూరల్: పూజల్లో పాల్గొన్న నాయకులు

ఎమ్మెల్యే పరామర్శ

కడ్తాల్: మండల పరిధి న్యామతాపూర్ గ్రామానికి చెందిన బండ రాంచంద్రి అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.. గురువారం రాంచంద్రి పార్థివదేహానికి నివాళులర్పించి.. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

గురువులకు ఘన సన్మానం

షాద్‌నగర్: గురు పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో ఉన్న సీతారామాంజనేయస్వామి దేవాలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు పిట్టల సురేష్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు వీరభద్రప్ప, చెన్నయ్య, శ్రీశైలం, కృష్ణమాచారి, రామకృష్ణయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

మొయినాబాద్: మండల పరిధిలోని శ్రీరాంనగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం గ్రామ నాయకులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు జంగయ్య, ఉపాధ్యాయులు శ్రీలత, సంధ్యను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వార్డుసభ్యురాలు శిరీషశివశంకర్, నాయకులు పాల్గొన్నారు.

పాదాభివందనం చేసి.. ఆశీర్వాదం పొంది..



షాద్‌నగర్‌రూరల్: గురువుకు పాదాభివందనం చేస్తున్న న్యాయవాది మహేందర్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: గురుపౌర్ణమిని పురస్కరించుకొని పట్టణానికి చెందిన న్యాయవాది చెంది మహేందర్ రెడ్డి గురువారం ఆయనకు చదువు చెప్పిన గురువుకు పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా గురువు కేశవరావును పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించి.. పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. చదువుకునే రోజుల్లో కేశవరావు అందించిన ప్రోత్సాహం మరువలేనిదని గుర్తుచేశారు. విద్యాబుద్ధులు నేర్పి భవిష్యత్‌ను తీర్చిదిద్దిన గురువులకు గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.



షాద్‌నగర్: విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న నాయకులు



మొయినాబాద్: శ్రీరాంనగర్ పాఠశాలలో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు

తల్లిదండ్రులను గౌరవించాలి

ఆశారాం బాపూజీ ఆశ్రమ ఆధ్యాత్మికవేత్త శ్రీశైలం

షాబాద్: ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని ఆశారాం బాపూజీ ఆశ్రమం ఆధ్యాత్మికవేత్త కటికల శ్రీశైలం, నాగర్‌గూడ శ్రీ చైతన్య పాఠశాల కరెస్పాండెంట్ సిద్దాపూర్ ప్రసాద్ అన్నారు. గురువారం వ్యాస పూర్ణిమ పర్వదినం పురస్కరించుకొని గురువారం మండల పరిధిలోని నాగర్‌గూడ శ్రీ చైతన్య పాఠశాలలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీశైలం ప్రధాన వక్తగా పాల్గొన్నారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురువు విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీరాములు, ఇన్‌చార్జి నరేందర్, ఉపాధ్యాయులు సఫియా, మధు, సమంతనాయక్, ప్రవీణ్, ప్రవళిక, అనురాధ, పాండు, శిల్ప, తాహురాబేగం, విద్యార్థులు తదితరులు ఉన్నారు.